సాక్షి
సిద్దిపేట
శనివారం । 30 । మార్చి । 2024



ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు



ఏసుక్రీస్తు గీతాలను ఆలపిస్తున్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అన్ని చర్చిలలో పలు కార్యక్రమాలు చేపట్టారు. క్రిస్టియన్లు ఉదయం నుంచే చర్చిలకు చేరుకున్నారు. పాస్టర్లు ఏసుప్రభు సందేశాన్ని వినిపించారు. భక్తులు ప్రత్యేక గీతాలు ఆలపించారు. చిన్నారులు ప్రత్యేక వేషధారణ, నృత్యాలతో అలరించారు. - ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



రోడ్డుపై పడిపోయిన పండ్లు

## పండ్ల ఆటో బోల్తా

### రూ.లక్ష విలువైన పండ్లు రోడ్డుపాలు

మిరుదొడ్డి(దుబ్బాక): పండ్లు తరలిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. సిద్దిపేట నుంచి అరటి, ద్రాక్ష పండ్లు రామాయంపేట వైపు తరలిస్తుండగా ధర్మారం శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. రూ.లక్ష విలువ గల పండ్లు దెబ్బతిన్నాయి. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. రహదారిపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా జేసీబీ సహాయంతో అక్కడి నుంచి తరలించారు.




## న్యూస్‌రీల్

### మాజీ ప్రభుత్వ విప్ కాంగ్రెస్‌లో చేరిక



అరెపల్లి మోహన్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపదాస్ మున్షీ

బెజ్జంకి(సిద్దిపేట): మాజీ ప్రభుత్వ విప్ ఆరెపల్లి మోహన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలో శుక్రవారం టీపీసీసీ ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానం



నవోదయలో ప్రసంగిస్తున్న న్యాయవాది లక్ష్మీలహరి

వర్గల్(గజ్వేల్): ఆటుపోట్లకు కుంగిపోకుండా ఆశావహ దృక్పథంతో ముందుకు సాగినపుడే విజయతీరాలకు చేరగలమని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, న్యాయవాది లక్ష్మీలహరి అన్నారు. శుక్రవారం వర్గల్ నవోదయలో రెండోరోజు బ్యాగ్‌లెస్ డే సందర్భంగా ఆమె విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, అబ్రహం లింకన్ వంటి మహా వ్యక్తులు ఆటుపోట్లు ఎదుర్కొని ఉన్నత శిఖరాలు అధిరోహించారన్నారు. రెండోరోజు విద్యార్థులు ఆటలు, పాటలు, ఇతర యాక్టివిటీస్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులు శేషు తదితరులు పర్యవేక్షించారు.

### మహాలక్ష్మిగా దుర్గమ్మ..



సంగారెడ్డి టౌన్ : మండల పరిధి ఇస్మాయిల్‌ఖాన్ పేట గ్రామంలో సప్త ప్రాకారయుత దుర్గా భవానీ ఆలయంలో శుక్రవారం 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారిని మహాలక్ష్మి రూపంలో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 31వ తేదీ వరకు ఈ వేడుకలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

### జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపిక

సంగారెడ్డి: జాతీయస్థాయి కబడ్డీ సబ్ జూనియర్ పోటీలకు సంగారెడ్డి జిల్లా కొల్లూరుకు చెందిన వైష్ణవి ఎంపికైంది. ఫిబ్రవరి 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఏప్రిల్ 1 నుంచి 4 వరకు బిహార్‌లో జరిగే కబడ్డీ పోటీల్లో విద్యార్థి పాల్గొననుంది.

# రెఫర్ పేరుతో నయా దందా!



### ప్రైవేట్ ఆస్పత్రులు, ఆర్‌ఎంపీల ఇష్టారాజ్యం

- రక్త పరీక్షలు, స్కానింగ్ అంటూ మోసం
- గుల్లవుతున్న సామాన్యుల జేబులు
- రోగులతో చెలగాటం
- పట్టించుకోని జిల్లా వైద్యారోగ్య శాఖ

సాక్షి, సిద్దిపేట: ఇందుర్తి మండలానికి చెందిన ఓ మహిళకు కిడ్నీలలో రాళ్లు ఉన్నట్లు తెలియడంతో హైదరాబాద్‌కు వెళ్లారు. ఆ గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీకి విషయం తెలియడంతో వెంటనే వారికి ఫోన్ చేశారు. 'హైదరాబాద్‌కు ఎందుకు వెళ్లారు? సిద్దిపేటలోనే తక్కువ ధరకు రూ.50వేలకే సర్జరీ చేపిస్తా రండి' అనడంతో వచ్చారు. సదరు మహిళకు సర్జరీ చేస్తుండగా మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే మహిళ మృతిచెందిందని రోగి బంధువులు ఆందోళన నిర్వహించారు.

సిద్దిపేటకు చెందిన ఓ వ్యక్తికి హైడ్రోసిల్ సర్జరీ కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆర్‌ఎంపీ రెఫర్ చేశారు. సర్జరీ ప్యాకేజీ మొత్తం రూ.55వేలు చెప్పారు. ఆర్‌ఎంపీ తెలిసినవారు అని చెప్పడం వల్ల తక్కువ చేసి చెప్పామని ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. నొప్పి భరించలేని రోగి బంధువులు చేయండి అని డబ్బులు చెల్లించారు.

కాసులకు కక్కుర్తి పడి కొందరు ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు, ఆర్‌ఎంపీలు కుమ్మక్కై కొత్త దందాకు తెరలేపుతున్నారు. రోగికి తక్కువ ఖర్చుతో సర్జరీ అయిపోయే దానిని ఆర్‌ఎంపీలు, ఆస్పత్రి నిర్వాహకులు కలిసి ఎక్కువ మొత్తంలో డబ్బులు లాగుతున్నారు. రోగికి అవసరం లేకున్నా రక్త పరీక్షలు.. స్కానింగ్.. మెరుగైన వైద్యం అందిస్తారంటూ ప్రైవేట్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఫలానా ఆ ఆస్పత్రికి లేదా స్కానింగ్ సెంటర్‌కే వెళ్లాలంటూ సూచిస్తున్నారు. ఇలా రెఫర్ చేయడంతో సదరు ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు నజరాలు, టూర్ ప్యాకేజీలైనా లేనిచో ఫిఫ్టీ ఫిఫ్టీ పంచుకుంటున్నట్లు తెలుస్తోంది. కొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు మార్కెటింగ్ సైతం చేసుకుంటున్నాయి.

**పుట్టగొడుగుల్లా ప్రైవేట్ ఆస్పత్రులు..**

జిల్లా వ్యాప్తంగా వైద్యారోగ్య శాఖ అనుమతి పొందినవి 158 ఉన్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ చెబుతోంది. జిల్లాలో నిత్యం పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు వైద్య సేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. అత్యవసర సమయాల్లో వచ్చే రోగులతో ఫీజుల వసూళ్లు మాత్రం కార్పొరేట్‌ను తలదన్నే స్థాయిలో ఉన్నాయి. రోగులు వచ్చిందే మొదలు వివిధ రకాల పరీక్షల పేరుతో ఓపీ స్థాయిలోనే వేలకు వేలు గుంజుతున్నారు. ఇటీవల ఆస్పత్రులు, వైద్యం వ్యాపారంగా మారిపోయింది. ముగ్గురు, నలుగురు కలసి ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకుని ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నారు. వైద్యులను నియమించుకొని వైద్యం అందిస్తున్నారు. మరో వైపు మెడికల్‌షాప్‌లు సైతం ఏర్పాటు చేసుకున్నారు. పైన ఆస్పత్రి కింద ల్యాబ్‌ను ఏర్పాటు చేసి బయట కంటే టెస్ట్‌లకు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. పెట్టిన పెట్టుబడిని కేవలం ఏడాదిలోపే సంపాదించేలా ప్రణాళిక వేసుకుని కమీషన్ల దందాకు తెరతీస్తున్నారు. ఇందుకోసం గ్రామాల్లోని ఆర్‌ఎంపీలు, పీఎంపీలతో ఒప్పందాల ద్వారా నడిపిస్తున్నారు.

### అడ్డగోలుగా ఫీజులు..

వైద్యం పేరుతో ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు అడ్డగోలుగా ఫీజులు దండుకుంటున్నారు. ఆర్‌ఎంపీలు, ఇతరులు సిఫారసుతో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రుల్లో చేరగా.. వైద్యం పేరుతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ రోగుల నడ్డీ విరుస్తున్నారు. టెస్టులు, పరీక్షలు, స్కానింగుల పేరుతో అందిన కాడికి దండుకుంటున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వార్డులో ఎంత చార్జి, డాక్టర్, నర్స్ ఫీజు ఎంత? ఇలా అన్ని రకాల సేవలకు ఎంత డబ్బులు వసూల చేస్తారో బోర్డు పై రాసిపెట్టాలి. అలా పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కన్పించడం లేదు. బోర్డులు ఏర్పాటు చేసిన సైతం వాటిని ఫాలో కావడం లేదు. ఇప్పటికైనా జిల్లా వైద్యారోగ్య శాఖ దృష్టి పెట్టి ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ప్రైవేటు ఆస్పత్రులు, ఆర్‌ఎంపీల దందాను అరికట్టాలని రోగులు కోరుతున్నారు.

### ప్రత్యేక దృష్టి సారిస్తాం

ప్రైవేట్ ఆస్పత్రుల పై ప్రత్యేక దృష్టి పెడతాం. క్లినికల్ ఎస్టాబ్లిస్ యాక్ట్ ప్రకారం అన్నీ ఉన్నాయా లేవా పరిశీలిస్తాం. ఆస్పత్రిలో అందించే సేవలకు వసూలు చేసే డబ్బులను బోర్డుపై రాసి పెట్టాలి. నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ

# పార్టీ ద్రోహులను క్షమించం



మాట్లాడుతున్న హరీశ్‌రావు, చిత్రంలో వెంకట్రామిరెడ్డి తదితరులు

- వ్యక్తులు కాదు, వ్యవస్థ ముఖ్యం
- కష్టకాలంలో కేసీఆర్‌కు అండగా నిలవాలి
- ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేటజోన్: కన్న తల్లిలాంటి పార్టీకి ద్రోహం చేసిన వారిని క్షమించేది లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కొండ మల్లయ్య గార్డెన్‌లో సిద్దిపేట నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్‌తోనే తెలంగాణ సాధ్యమైందన్నారు. వ్యక్తులు కాదని, వ్యవస్థ ముఖ్యమని అన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో నా విజయం కోసం పార్టీ శ్రేణులు ఎంతగా కష్టపడ్డారో అదే తరహాలో ఇప్పుడు ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి కోసం కష్టపడాలని సూచించారు. మెదక్ ఎంపీ స్థానానికి పోటీ చేసే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలన్నారు. ఓటు ద్వారా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సిద్దిపేటలో జరిగిన అభివృద్ధి చూసి ఓర్వలేకే రఘునందన్ ఆరోపణలు చేస్తున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం సిద్దిపేటలో జరిగే ప్రగతిని అడ్డుకుంటున్నారని అన్నారు. సిద్దిపేట వెటర్నరీ కళాశాలను కొడంగల్ తరలించారని, సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్ లేన్ రోడ్డును రద్దు చేసి, నిధులు రాకుండా చేశారని ఆరోపించారు.

**ప్రజాసేవకు అంకితం..**

'నాకు ఉద్యోగ, రాజకీయ పరంగా జన్మ ఇచ్చిన గడ్డ ఇది. ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయాలని ముందుకు వచ్చా, నా జీవితం మీకే అంకితం' అని మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అన్నారు. పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఎంపీగా గెలిచిన వెంటనే రూ.100 కోట్లతో పేద విద్యార్థుల చదువు కోసం పీవీఆర్ పేరిట ట్రస్ట్ ఏర్పాటు చేస్తానని అన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్మన్ మంజుల, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వారి ఆటలు సాగనివ్వం



వేదికపై హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాటామంతి

దుబ్బాక: మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఆటలు సాగనివ్వబోమని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గం బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏనాడన్నా సీఎం రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అన్నారా అని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాల్సిందేనని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇది పోరాటాల గడ్డ, బీఆర్‌ఎస్ అడ్డా అని అన్నారు. నాకు ఈ ఎమ్మెల్యే పదవి మా కార్యకర్తలు పెట్టిన భిక్ష అన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఒక్క అవకాశం ఇస్తే నేను మీ కుటుంబసభ్యుడిలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని మెదక్ ఎంపీ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి అన్నారు. దుబ్బాకతో నాకు ఎంతో అనుబంధం ఉంది కలెక్టర్‌గా ఉన్న సమయంలో చాలా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# నాచగిరిలో ఆధ్యాత్మిక వైభవం



అంకురార్పణ కార్యక్రమంలో పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి, ఈఓ అన్నపూర్ణ తదితరులు

### బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుని నవాహ్నిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం క్షేత్ర పీఠాధిపతి మధుసూదనానంద సరస్వతి, ఆలయ ఈఓ అన్నపూర్ణ జ్యోతి ప్రజ్వలన చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. అర్చక వేదపండిత పరివారం, పురప్రముఖులు, ఆలయ సిబ్బంది సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**నేడు ధ్వజారోహణం**

లోక కల్యాణమే పరమావధిగా నిర్వహిస్తున్న నాచగిరీశుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా గరుడ ఆళ్వారుకు మహా నివేదన చేసి బ్రహ్మోత్సవ బాధ్యతలను అప్పగిస్తారు. రాత్రి భేరీ పూజ నిర్వహించి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతారు.

### కల్లు దుకాణాలపై దాడులు

జోగిపేట(అందోల్): అక్రమంగా నిర్వహిస్తున్న కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ సాగర్‌రెడ్డి తెలిపిన వివరాలు. జోగిపేట పట్టణం తోపాటు అందోల్, చందంపేట గ్రామాలలో అనుమతులు లేకుండా దుకాణాల్లో విక్రయిస్తున్న కల్లును ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాలుగు దుకాణాలలో 600 లీటర్ల కల్లు పారబోసి నలుగురిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

# ఇఫ్తార్ విందులతో సమైక్యతాభావం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వంటేరు ప్రతాప్‌రెడ్డి, ముస్లింలు

గజ్వేల్: రంజాన్ పవిత్రమాసంలో ముస్లిం సోదరులందరికీ శుభాలు కలగాలని అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. ముట్రాజ్‌పల్లిలో శుక్రవారం రాత్రి బీఆర్‌ఎస్ నేత వసీంఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఇఫ్తార్ విందులతో సమైక్యతాభావం పరిఢవిల్లుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు నవాజ్‌మీర తదితరులు పాల్గొన్నారు.

# అరకొర పరిహారంపై ఆగ్రహం

- ఆందోళన బాటలో ట్రిపుల్‌ఆర్ బాధిత రైతులు
- బహిరంగ మార్కెట్‌లో భూములకు రూ.కోటిపైనే ధర
- ఎంపీ ఎన్నికల తర్వాత స్పష్టత వచ్చే అవకాశం



ట్రిపుల్‌ఆర్ పరిహారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగిన భూ బాధితులు (ఫైల్)

గజ్వేల్: ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగు రోడ్డు) భూసేకరణ తీరుపై భూబాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు కోటికిపైగా పలుకుతున్న భూములకు అతి తక్కువగా పరిహారం అందజేస్తామని అధికారులు చెబుతుండటంతో కలవరానికి గురవుతున్నారు. నేషనల్ హైవే యాక్ట్-1956 ప్రకారం ముందుకెళ్తామని అధికరులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 20న మర్కూక్ మండలం చేబర్తి రెవెన్యూ పరిధిలోని చేబర్తి, నర్సన్నపేట గ్రామాలకు చెందిన భూబాధితులు ఆర్‌డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన సంగతి తెల్సిందే. ఉత్తర భాగం రీజినల్ రింగు రోడ్డు (ట్రిపుల్‌ఆర్) భూసేకరణ ప్రక్రియ మొదలైంది. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో 32 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరగనుంది. డివిజన్ పరిధిలోని జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి, ఇటిక్యాల, అలిరాజపేట, మర్కూక్ మండలం అంగడి కిష్టాపూర్, చేబర్తి, ఎర్రవల్లి, పాములపర్తి, గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్, ముట్రాజ్‌పల్లి, సంగాపూర్, మక్తమాసాన్‌పల్లి, బంగ్లావెంకటాపూర్, వర్గల్ మండలం మైలారం, జబ్బాపూర్, నెంటూర్, రాయపోల్ మండలం బేగంపేట, ఎల్కల్ గ్రామాల్లో మొత్తంగా 980 ఎకరాల భూసేకరణ జరగనుంది. ఉత్తర భాగం పరిధిలో అత్యధికంగా ఇక్కడే భూసేకరణ జరగనున్నది. ఈ క్రమంలోనే అధికారులు ఆయా గ్రామాల్లోని రైతులకు నోటీసులు ఇచ్చారు. గజ్వేల్‌లోని ఆర్‌డీఓ కార్యాలయానికి పిలిచి కొన్ని రోజులుగా వరుస సమావేశాలను నిర్వహిస్తున్నారు. పరిహారం పంపిణీకి సంబంధించి 1956 నేషనల్ హైవే యాక్ట్ ప్రకారం ముందుకుసాగుతున్నామని వివరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో భూములకు ఉన్న ప్రభుత్వ విలువల ప్రకారం ధర నిర్ణయం జరగనున్నదని చెబుతున్నారు. ఈనెల 20న మర్కూక్ మండలం చేబర్తి రెవెన్యూ పరిధిలోని చేబర్తి, నర్సన్నపేట గ్రామాలకు చెందిన రైతులను పిలిపించి సమావేశం ఏర్పాటు చేశారు. నేషనల్ హైవే యాక్ట్ ప్రకారం ఎకరాకు కేవలం రూ.7.54లక్షల పరిహారం చెల్లించే అవకాశమున్నదని చెప్పారు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు తమ గ్రామాల్లో మార్కెట్ ధర ప్రస్తుతం ఎకరాకు రూ.కోటికిపైగానే పలుకుతున్నదని, ఇంతటి విలువైన భూములకు కేవలం 8శాతంలోపే చెల్లిస్తామంటూ ఎలా? అంటూ మండిపడుతూ సమావేశాన్ని బహిష్కరించారు. అంతేకుండా ధర్నా చేపట్టి అధికారుల తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భూబాధితులు పాత అలైన్‌మెంట్ మార్చి...తమ గ్రామాల్లోంచి ట్రిపుల్‌ఆర్ వెళ్లేలా చేశారని, గత ప్రభుత్వంలో ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. అంతేకాకుండా హైదరాబాద్ అవుటర్ రింగు రోడ్డు నుంచి ట్రిపుల్‌ఆర్ రేడియస్‌ను 60కిలోమీటర్లు ఉంచాల్సి ఉండగా, కేవలం 33కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ గ్రామాలను చేర్చారని కూడా ఆరోపిస్తున్నారు. ఒకవేళ భూములు తీసుకోవాల్సి వస్తే...భూమికి బదులు భూమి ఇవ్వాలని లేదా, సముచిత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ఒక్క గ్రామ రైతులే కాదు...మిగిలిని 16 గ్రామాల రైతుల పరిహారం తీరుపై ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం రెవెన్యూ యంత్రాంగమంతా పార్లమెంట్ ఎన్నికల పనిలో ఉండటం వల్ల ఈ ప్రక్రియ అనుకున్నంత వేగంగా సాగటం లేదు. అందువల్ల ధర నిర్ణయంపై పూర్తిస్థాయి స్పష్టత రాలేదు. పోలింగ్, ఫలితాల తర్వాత ఈ ప్రక్రియ వేగంగా ముందుకు సాగే అవకాశాలున్నాయి.

### భూమికి భూమి ఇవ్వాల్సిందే



ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో రెండెకరాలకుపైగా భూమి పోతుంది. పరిహారం అతి తక్కువగా ఇస్తామంటున్నారు. భూమికి బదులు భూమి ఇవ్వాలి. లేదా సముచిత పరిహారం ఇవ్వాల్సిందే.

–రాంరెడ్డి, ట్రిపుల్‌ఆర్ భూబాధితుడు, నర్సన్నపేట

## క్లుప్తంగా

### చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి


నర్సింహులు మృతదేహం

రాయపోలు(దుబ్బాక): చేపల వేటకు వెళ్లి వ్యక్తి చెరువులో పడి మృతిచెందిన ఘటన మండలంలోని రామారంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రఘుపతి కథనం ప్రకారం... దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన విబూది నర్సింహులు(42) గురువారం సాయంత్రం రామారం శివారు మాలకుంటలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. కాగా, ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగి మృతిచెందాడు. ఎంతకీ ఇంటికి రాకపోయే సరికి శుక్రవారం కుటుంబ సభ్యులు కుంటలో ఈతగాళ్ల సహాయంతో గాలించగా మృతదేహం బయటపడింది. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### అదుపు తప్పిన ఆటో కారును ఢీకొని..

ఒకరికి గాయాలు

కొండపాక(గజ్వేల్): ట్రాలీ ఆటో అదుపు తప్పి కారును ఢీ కొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కుకునూరుపల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కొండపాక మండలం సిర్సనగండ్ల గ్రామానికి చెందిన దండ్ల ఐలయ్య.. సిద్దిపేట మండలం మిట్టపల్లి గ్రామం నుంచి ప్రయాణికులతో గజ్వేల్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో కొమురవెల్లి కమాన్ వద్దకు రాగానే కళ్లు తిరుగుతున్నాయని ఆటోను రోడ్డు పక్కకు ఆపాడు. కొద్దిసేపు తర్వాత గమ్య స్థానం వైపు పయనమవుతూ కుకునూరుపల్లిలో మరోసారి కళ్లు తిరుగుతున్నాయని రోడ్డు పక్కకు పార్క్ చేసే క్రమంలో అదుపు తప్పి ఇక్కడే పార్క్ చేసిన కారును ఢీకొట్టాడు. దీంతో డ్రైవర్ ఐలయ్య ముఖం, చేతికి గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకున్న 108లో క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### డీజిల్ తస్కరణ


డీజిల్ ట్యాంక్ తాళం పగులగొట్టిన దృశ్యం

దుబ్బాక: రెండు బస్‌ల డీజిల్ ట్యాంక్‌లు పగులగొట్టి ఆయిల్ చోరీ చేసిన ఘటన పట్టణంలో శుక్రవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ గంగరాజు కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన బూరు స్వామి తన రెండు బస్సులను ఆర్టీసీ అద్దె ప్రతిపాదికన నడిపిస్తున్నాడు. రోజూలాగే గురువారం రాత్రి కూడా పట్టణంలోని బాలాజీ ఆలయం వద్ద వాహనాలను పార్క్ చేశాడు. రెండింటికి చెందిన డీజిల్ ట్యాంకుల తాళాలు పగులగొట్టి మొత్తం 500 లీటర్లు అంటే రూ.50 వేల విలువ జేసే ఇంధనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేశారు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా కారులో వచ్చి దొంగతనం చేసిన సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. వాటి ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు.

### మద్యం బాటిళ్లు స్వాధీనం

దుబ్బాకరూరల్: బెల్ట్‌షాపులపై పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన మండల పరిధిలోని అప్పనపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో మద్యం అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు దుబ్బాక పోలీసులతో కలిసి మద్యం విక్రయిస్తున్న అతికం పద్మ, మెరుపుల సత్యనారాయణ ఇళ్లల్లో దాడి చేసి 13 లీటర్ల విస్కీ, బీర్‌బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్స్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9773917835. [T-12 82718]

WANTED

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13624]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185007]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


## అబ్బురపరుస్తున్న నమూనాలు

సిద్దిపేట జిల్లా టౌన్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగంలో జంతువుల నమూనాలతో అరుదైన మ్యూజియం ఏర్పాటు చేశారు. మానవ పిండం, ఎగిరే చేప (ఎక్సోసిటస్), అంటూ పిల్ల చేప (ఎకినీస్), సాలమాండర్ (అంబిస్టోమ), కొండచిలువ (పైథాన్), దేవాంగపిల్లి (లోరిస్), పొలుసులు పిపీలికా హరి (మేనిస్), సజీవ శిలాజమైన రాచపీత (లిమ్యులస్), పులి, తోడేలు, మొసలి పుర్రెలు, నిప్పుకోడి గుడ్డు, మధ్య మహాయుగం నాటి సరీసృపాల (డైనోసార్స్) నమూనాలు, దాదాపు 450కి పైగా నిజజీవుల నమూనాలు ఉన్నాయి. మ్యూజియాన్ని నిత్యం అనేకమంది విద్యార్థులు సందర్శిస్తుంటారు.. వారికొచ్చే సందేహాలను జంతు శాస్త్ర విభాగాధిపతి అయోధ్యరెడ్డి నివృత్తి చేస్తున్నారు.

– సాక్షిస్టాఫ్, ఫొటోగ్రాఫర్, సిద్దిపేట









# జీవనోపాధి.. పలువురికి ఉపాధి

- టమాట రైతు మహిపాల్‌రెడ్డి ఆదర్శం
- 104 ఎకరాల్లో కూరగాయలు, వరి సాగు
- రోజూ 50 నుంచి 100 మందికి పనులు

**తాను ఎదుగుతూ.. నలుగురికి జీవనోపాధి చూపుతున్నారు రైతు మహిపాల్‌రెడ్డి. తనకున్న వ్యవసాయ భూమితోపాటు కొంత కౌలుకు తీసుకొని డిమాండ్‌కు అనుగుణంగా రకరకాల కూరగాయల సాగు చేపడుతున్నారు. ఇక్కడి స్థానికులకు ఉపాధి చూపుతున్నారు.**

-కౌడిపల్లి(నర్సాపూర్)


క్యాప్సికం పంటలో పనులు చేస్తున్న కూలీలు

కౌడిపల్లి మండల మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన రైతు బాన్సువాడ మహిపాల్‌రెడ్డి. ఇటీవల టమాట సాగు చేసి కోటి రూపాయలు సంపాదించి టమాట రైతుగా గుర్తింపు పొందారు. అయితే అతనికి సొంతగా 20 ఎకరాల సాగు భూమి ఉంది. 12 ఏళ్ల క్రితం సంప్రదాయ పంటల నుంచి కూరగాయల సాగు వైపు దృష్టి సారించారు. అందుకుగాను పలు జిల్లాలు, రాష్ట్రాలలో పర్యటించి సాగు వివరాలు తెలుసుకున్నారు. పెద్ద ఎత్తున సాగు చేపట్టాలనే ఉద్దేశంతో కౌడిపల్లిలో 60 ఎకరాలు, మహమ్మద్‌నగర్‌లో 24 ఎకరాలు, ముత్రాజ్‌పల్లిలో 20 ఎకరాలు లీజుకు తీసుకున్నాడు. వరితోపాటు టమాట, క్యాప్సికం, బీరకాయ, కాకరకాయ పంటలను డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేస్తున్నాడు. అలాగే వరిని సైతం పండిస్తుంటారు.

**రోజూ 50 నుంచి 100 మందికి పని..**

మండలంలోని మహమ్మద్‌నగర్, ముత్రాజ్‌పల్లి, కౌడిపల్లిలో సాగవుతున్న 104 ఎకరాల్లో రోజూ 50 నుంచి 100 మందికి పైగా కూలీలు వ్యవసాయ పనులు చేస్తుంటారు. కూరగాయల పంటలో మల్చింగ్ పద్ధతిలో నేలపై పేపర్ వేయడం, కర్రలు పాతడం, మొక్కలు నాటడం, కలుపు తీయడం, డ్రిప్ పనులతోపాటు కూరగాయల మొక్కలు పైకి వెళ్లేందుకు తాడు కట్టడం, కాయలు తెంపడం, ట్రేలలో నింపి ఆటోలో మార్కెట్‌కు తరలించడం ఇతర పనులు నిత్యం జరుగుతుంటాయి. దీని కోసం రోజు కౌడిపల్లి, వెల్మకన్న, మహమ్మద్‌నగర్, శేరితండా, ముత్రాజ్‌పల్లి, రాజిపేట గ్రామాలకు చెందిన 50 నుంచి 100మంది కూలీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొందరు పనులు చేస్తుంటారు. ఇలా కొన్నేళ్లుగా ఉపాధి చూపుతున్నాడు.

### మూడేళ్లుగా ఇక్కడే పని చేస్తున్నా



మూడేళ్లుగా మహిపాల్‌రెడ్డి వద్ద పని చేస్తున్నా. లాభం నష్టం, వానాకాలం, ఎండాకాలంతో సంబంధం లేకుండా రోజూ దినసరి కూలీ రూ.350లు చెల్లిస్తున్నారు. కూరగాయల పొలంలో తనతోపాటు పలు గ్రామాలు, తండాల కూలీలు పనులు చేస్తున్నారు. దీంతో గ్రామంలో ఉపాధి దొరుకుతుంది. ఇంటి అవసరాలకు సైతం కూరగాయలు ఇస్తారు.

– ఇట్టబోయిన భాగ్యమ్మ, కౌడిపల్లి

### డిమాండ్‌కు అనుగుణంగా సాగు చేయాలి



రైతులు సంప్రదాయ పంటలకు బదులుగా కూరగాయల సాగు చేస్తే మంచి లాభాలు ఆర్జించవచ్చు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉంది. పైగా మంచి డిమాండ్ కూడా ఉంది. పంటను మార్కెట్ డిమాండ్‌ను అంచనా వేసి సాగు చేయాలి. మల్చింగ్, డ్రిప్ పద్ధతి, షెడ్‌నెట్, నీడపందిరి సాగుతో మంచి ఫలితం ఉంటుంది. కూరగాయల పంటకు కచ్చితంగా పశువులు, కోళ్ల ఎరువు వేయాలి. చీడపీడలను గుర్తించి సకాలంలో నివారిస్తే మంచి లాభాలు పొందొచ్చు.

– మహిపాల్‌రెడ్డి

# మాత్రల కోసం వెళ్లి కానరాని లోకాలకు

- గుర్తు తెలియని వాహనాన్ని బైక్‌తో ఢీకొట్టి విద్యార్థి మృతి
- స్నేహితుడికి తీవ్ర గాయాలు


సుదీప్ (ఫైల్)


చికిత్స పొందుతున్న జస్వంత్

పటాన్‌చెరు టౌన్: గుర్తుతెలియని వాహనాన్ని వెనుక నుంచి స్కూటీతో ఢీకొట్టిన ఘటనలో ఒక విద్యార్థి మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు పట్టణం సీతారామపురం కాలనీకి చెందిన గిరిప్రసాదరావు, రూపవతికి సంతానం సుదీప్ పట్నాయక్(15). అతను మంజీర స్కూల్లో పదో తరగతి చదువుతున్నాడు. గురువారం అర్ధరాత్రి తల్లికి పంటి నొప్పి రాగా మాత్రలు తెచ్చేందుకు స్కూటీ నడుపుకుంటూ సుదీప్.. శాంతినగర్‌లో నివాసం ఉంటూ గీత స్కూల్‌లో అదే తరగతి చదివే స్నేహితుడు జస్వంత్ వద్దకు వెళ్లాడు. అతడిని వెంటబెట్టుకొని మార్గమధ్యలో నవపాన్ సమీపంలోకి వెళ్లి అక్కడున్న బంకులో పెట్రోల్ పోయించుకొని పటాన్‌చెరు వైపు వస్తుండగా వ్యాల్యూ మార్ట్ సమీపంలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో తీవ్రగాయాలై సుదీప్ ఘటన స్థలంలోనే మృతిచెందాడు. జస్వంత్ కూడా తీవ్రగాయాలు కాగా.. చికిత్స కోసం పటాన్‌చెరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం సుదీప్ తండ్రి గిరిప్రసాద్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### మంత్రి ప్రత్యేక పూజలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రేణుకా ఎల్లమ్మకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగ తం పలికారు.



# మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

దుబ్బాక: భార్య వేరేవ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని వెళ్లిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఎస్‌ఐ గంగరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దుబ్బాక మునిసిపాలిటీ పరిధిలోని చేర్వాపూర్‌లో రామలింగన్న పిట్టలవాడకు చెందిన కాలియ జయరాం(34) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం ఒక యువతితో వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. ఈక్రమంలో 6 నెలల క్రితం అదే కాలనికి చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుని వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై తన గుడిసెలోనే ఉరివేసుకొని ఆత్యహత్యకు పాల్పడ్డాడు. అమ్మా నాన్న టాటా..బైబై అంటూ వీడియో రికార్డు పెట్టాడు. తండ్రి గంగరాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## పాముకాటుతో రైతు..
# అడవి పంది దాడిలో బాలుడు..

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి


చాకలి మల్లేశం(ఫైల్)

హత్నూర (సంగారెడ్డి): పాము కాటుకు గురైన రైతు శుక్రవారం రాత్రి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని సికింద్లాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రైతు చాకలి మల్లేశం(32) గురువారం మధ్యాహ్నం గ్రామ శివారులో ఉన్న పొలానికి నీళ్లు పెడుతుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి మల్లేశం పరిస్థితి విషమించి మృతి చెందాడు.

**ఒక్కసారిగా దూసుకొచ్చిన ..**

సిద్దిపేటఅర్బన్: అడవి పంది దాడి చేసిన ఘటనలో బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని బక్రి చెప్యాలలో శుక్రవారం సాయంత్రం జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన దేశెట్టి ఎల్లయ్య, స్వామి(13) తండ్రీకొడుకులు. తమకు చెందిన రెండింటిని, ఎల్లయ్య పని చేసే వ్యక్తికి చెందిన మూడు మేకలను పొలం వద్ద మేపుతున్నారు. ఈ క్రమంలో జీవాలను పక్క పొలం వద్దకు తోలగా అమాంతం పాడుబడిన బావి గుంత నుంచి ఒక్కసారిగా వచ్చిన అడవి పంది స్వామిపై దాడి చేసింది. దీంతో అతని చాతీపై తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు గమనించి దాన్ని తరిమారు. వెంటనే క్షతగాత్రుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేస్తుండగానే మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు త్రీటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# టైఫాయిడ్‌తో బాలింత మృతి

- ఐదో నెలలో ప్రసవించిన ఇద్దరు శిశువులు సైతం..
- పంతుల్ తండాలో విషాదం


అనిత(ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): టైఫాయిడ్ బారిన పడి బాలింత మృతి చెందింది. ఈ విషాదకర ఘటన మండలంలోని పంతుల్‌తండాలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లావుడ్యి లావణ్య అలియాస్ అనిత(26), శంకర్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడంతో వైద్యచికిత్సలు తీసుకుంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భవతి. నెల రోజుల కిందట జ్వరం రావడంతో చికిత్స తీసుకుంటూ మందులు వాడుతుంది. కానీ జ్వరం కాస్తా టైఫాయిడ్‌గా మారి మూత్రం ఆగిపోయింది. దీంతో గురువారం రాత్రి డాక్టర్ల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి ఆమెను తరలించారు. అక్కడ అప్పటికే ప్రాణం లేని కవల పిల్లలను ప్రసవించింది. అనంతరం కొద్ది నిమిషాల వ్యవధిలో తానూ కన్నుమూసింది. దీంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. కాగా, తల్లీబిడ్డలు చనిపోయిన విషయం తెలియడంతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

**హైదరాబాద్‌లో ఉండి.. పోటీ పరీక్షలకు...**

అనిత బీటెక్, ఆమె భర్త శంకర్ పీజీ వరకు చదువుకున్నారు. ఇద్దరు హైదరాబాద్‌లో ఉంటూ పార్ట్‌టైం జాబ్ చేసుకుంటున్నారు. పోటీ పరీక్షలకు సైతం సిద్ధమవుతున్నారు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తారన్న గంపెడాశతో ఎదురుచూస్తున్న కుటుంబసభ్యులకు ఆమె మృతిచెందిందన్న వార్త స్వగ్రామంలో అందరినీ కంటతడిపెట్టించింది.

# నాపై డాక్టర్ దాడి చేశాడు

రోగి భర్త ఆరోపణ ● పోలీసులకు ఫిర్యాదు


డాక్టర్ దాడిలో గాయపడ్డ బాధితుడు

నారాయణఖేడ్: తనపై డాక్టర్ చేయిచేసుకున్నాడని బాధితుడి ఆరోపణలు చేసిన ఘటన స్థానిక ఏరియా ఆస్పత్రిలో చోటుచేసుకుంది. బాధితులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మనూరు మండలం శెల్గిర గ్రామానికి చెందిన ప్రసాద్ తన భార్య అస్వస్థతకు గురైందని శుక్రవారం ఖేడ్ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చాడు. రోగికి రక్త పరీక్షలు రాసి తాము సూచించిన లేబొరేటరీలోనే పరీక్షలు చేయించాలని బాధితుడికి డాక్టర్ రాజ్‌కుమార్ సూచించాడు. తాము వేరే చోట పరీక్షలు చేయించుకొని వస్తానని చెప్పగా కోపోద్రిక్తుడైన వైద్యుడు చేయిచేసుకున్నాడని, చేతికి అందిన వస్తువులు, రాడ్‌తో దాడి చేసినట్లు బాధితుడు వాపోయారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే పరీక్షలు ఉచితంగా చేయాల్సి ఉండగా ప్రైవేట్‌కు చిట్టీలు రాయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆ మేరకు డాక్టర్‌పై చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. కాగా, బాధితుడి సోదరుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపారు. అయితే విధులకు ఆటంక పర్చినట్లు డాక్టర్ కూడా ఫిర్యాదు ఇచ్చాడు. దీనిపై డీసీహెచ్‌ఎం సంగారెడ్డి స్పందిస్తూ, రోగికి పరీక్షలు ఉచితంగా ఆస్పత్రిలోనే చేయాలని, కానీ బయటకు చిట్టీ రాయడం తప్పన్నారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

# అనుమానాస్పద స్థితిలో మైనర్...

చింతమడకలో ఘటన

సిద్దిపేటరూరల్: మైనర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని చింతమడకలో చోటు చేసుకుంది. సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రంగు రాజు, లావణ్య దంపతుల పెద్దకుమారుడు రంగు సిద్దార్థ(17) పదో తరగతి పూర్తి చేసి ఇంటి వద్ద కూలీ పనులకు వెళుతున్నాడు. గురువారం గ్రామంలో పెళ్లి జరగడంతో భరత్ ఉందని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి 9గంటల సమయంలో తల్లి ఫోన్ చేస్తే వస్తున్నానన్నాడు. రాత్రి 10 గంటలైనా ఇంటికి చేరక పోవడంతో మరోసారి కాల్ చేస్తే ఎత్తడం చేయలేదు. కాగా, 11 గంటల సమయంలో లావణ్య బావ అయిన తిరుపతి పొలం వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేసి ఇంటికొస్తుండగా సిద్ధార్థ గ్రామ సమీప పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఉన్నాడని తెలపడంతో కుటుంబ సభ్యులు అందరు ఇక్కడి వెళ్లి చూస్తే అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుమారుడి చేయిపై గీసుకుపోయిన గుర్తులు ఉన్నాయని అనుమానం వ్యక్తం చేసి, ప్రేమ వ్యవహారమే కారణమని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# పట్టాలు దాటని పురోగతి

**ప్రముఖ ఆలయం.. భక్తులు తాకిడి అధికం. ఏళ్లుగా వినతులు.. వెరసి రైల్వేహాల్ట్ స్టేషన్ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. అంగరంగ వైభవంగా శంకుస్థాపన జరుపుకొంది. ఇది జరిగి సుమారుగా 40 రోజులు గడుస్తున్నా.. పనుల్లో పురోగతి కనిపించక పోవడంతో ప్రజలు, భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో మూడు నెలల సమయం పడుతుందని అధికారులు చెబుతుండటం గమనించాల్సిన విషయం. అయితే మల్లన్న భక్తుల చిరకాల కోరిక నెరవేరాలంటే ఇంకొన్ని రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.**

- 40 రోజుల క్రితం కొమురవెల్లి రైల్వే స్టేషన్ పనులకు శంకుస్థాపన
- ఫిబ్రవరి 15న కేంద్ర మంత్రి చేతుల మీదుగా ప్రారంభం
- స్టేషన్ ఏర్పాటుకు పూర్తి కాని టెండర్ల ప్రక్రియ


పనులు ప్రారంభించని కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రాంతం

కొమురవెల్లి(సిద్దిపేట): కొత్తపల్లి నుంచి మనోహరాబాద్ వరకు ఏర్పాటు చేస్తున్న నూతన రైల్వే లైన్‌లో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి సమీపంలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని పలు మార్లు ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు విన్నవించారు. ఎట్టకేలకు దిగొచ్చిన కేంద్ర ప్రభుత్వం కొమురవెల్లి ఆలయ సమీపంలో రైల్వే హాల్ట్ స్టేషన్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా గత ఫిబ్రవరి 15న రూ.5 కోట్లతో భూమి పూజ కూడా చేశారు. ఈ సందర్భంగా ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భూమి పూజ చేసి 40 రోజులు గడుస్తున్నా.. పనుల్లో ఇంకా పురోగతి కనిపించడం లేదు. అంతేకాకుండా రైల్వే స్టేషన్ ఏర్పాటుకు కావాల్సిన పనులకు టెండర్లు ప్రక్రియ పూర్తి కాలేదు. ఇప్పటికైన రైల్వే అధికారులు స్పందించి వెంటనే టెండర్లు పిలిచి పనులు మొదలు పెట్టాలని, వచ్చే సంవత్సరం స్వామి వారి జాతర వరకు స్టేషన్ పనులు పూర్తి చేయాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

### మరో మూడు నెలలు సమయం

కొమురవెల్లి హాల్ట్ రైల్వే స్టేషన్ పనులు మొదలు పెటేందుకు మరో మూడు నెలల సమయం పడుతుంది. అప్రోచ్ రోడ్డు కోసం భూమిని సేకరించాలి దీంతో పాటు లోక్‌సభ ఎన్నికల కోడ్ వచ్చింది. ఇక పనులు ప్రారంభించాలంటే ఆలస్యం కానున్నాయి. టెండర్లు పూర్తి కాగానే పనులను ప్రారంభిస్తాం.

– సంతోష్ కుమార్, రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజినీర్


రైల్వే స్టేషన్ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి (ఫైల్)

### పనులు వెంటనే ప్రారంభించాలి



కొమురవెల్లి మల్లికార్జున ఆలయ సమీపంలో రైల్వే స్టేషన్ పనులు వెంటనే ప్రారంభించాలి. ఒకవేళ స్టేషన్ అందుబాటులోకి వస్తే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మా లాంటి భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుంది. మల్లన్న భక్తులను దృష్టిలో పెట్టుకొని రైల్వే అధికారులు చొరవ చూపాలి.

–దిలీప్, భక్తుడు